# పనికిరాని పాఠాలు

శ్రీ మంచిరాజు వెంకటరావు

సుబ్బరామయ్యగారి చిన్నతనంలో అనేకమంది దైవజ్ఞులు చెప్పారు: 'వీడుపట్టింది బంగార మౌతుంది. వీడియిల్లు నాలుగిళ్ళౌతుంది. వీడన్న మాట రాజశాసనం.' ఇలా జ్యోతిష్కులు చెప్పినప్పుడల్లా 'సుబ్బరామయ్య' ముక్కుపుటా లెగరేసేవాడు.

'నా మీద అభిమానంకొద్దీ మీ రలా అంటున్నారు గాని, ఈ చవట చదువులో రాణించటం లేదండీ,' అనేవారు వాళ్ళనాన్న రంగయ్యగారు.

'మనిషన్న వాడికి తారాబలం, చంద్రబలం వుండాలిగాని, చదువెందుకండి రంగయ్యగారూ. మన సూర్యనారాయణ శాస్త్రిగారు సంస్కృతాంధ్రాల్లో మహావిద్వాంసుడు. వేదపురాణాలు ఆమూలాగ్రంగా, వ్యాఖ్యానసహితంగా చదివేశారు. అయితేయేం, చెంబు తెల్లగాతోమి మీ యింటికీ మా యింటికీ యాయవారానికి రానిరోజు డొక్కాడదు. చదువెందుకండీ, దిక్కుమాలిన చదువు!' అని జ్యోతిష్కులు వక్కాణించేవారు. రంగయ్యగారు గర్వంగా మీసాలు వొడేసుకునేవారు.

జ్యోతిశ్శాస్త్రాన్ని తిరస్కరించేవారికి, సుబ్బరామయ్య వృద్ధిలోకివచ్చిన తీరు చెప్పుదెబ్బగా పరిణమించింది. స్కూలుఫైనల్ ఐదవసారి తప్పిన సుబ్బరామయ్య, రంగయ్యగారితో నిష్కర్షగా ఒకమాట చెప్పాడు: 'నాన్నా, ఏటి కెదురీదటం నాకిష్టమేగాని, ఆ పని ఈ చదువనే ఏటిలోకాక మరి దేంట్లోనైనా చేస్తాను. నా బుర్ర పోనిదాంట్లో న న్నిరికించి చంపకు.'

'అయితే లక్షణంగా పెళ్లిచేసుకుని యింటిపట్టున పడుండు' అన్నారు రంగయ్యగారు. సరే నన్నాడు సుబ్బరామయ్య.

భార్య కాపరానికివచ్చిన కొద్దిఏళ్లకే సుబ్బరామయ్య రాజకీయాల్లో ప్రవేశించాడు. కాని అప్పట్లో చాలామంది తెలివితక్కువవాళ్లలాగ కళ్లుమూసుకుని దూకలేదు. అయాచితంగా అతని వొళ్లో—నిజానికి తండ్రి వొడిలో—వాలిన సదవకాశాన్ని చక్కగా వినియోగించుకున్నాడు. మద్రాసురాష్ట్రపు ఎసెంబ్లీకి ఆ యేడాది ఎన్నికలయ్యాయి. ఆ యెన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా ఒక యువనాయకుడు నిలబడ్డాడు. వయస్సులో తక్కువయినా ఆ నాయకుడు అప్పటికే దేశవ్యాప్తంగా పెద్ద పేరు సంపాదించుకున్నాడు. అతనికి ప్రత్యర్థిగా, జస్టిస్‌పార్టీవారు, ఒక యువతరం పెద్దమనిషిని నిలబెట్టాలని వెతకటం ప్రారంభించారు. జస్టిస్‌పార్టీ అభ్యర్థికి కావలసినవి మూడే అర్హతలు ప్రకటించారు.

ఒకటి : అభ్యర్థి స్వంతఖర్చుతో ఎన్నికల ప్రచారం చేసుకోవాలి.

రెండు : యువకుడు—ముప్పై ఏళ్లలోపు వాడుగా వుండాలి.

మూడు : ఆ ప్రాంతాల్లో ప్రాబల్యం కలిగిన కులానికి చెంది వుండాలి.

ఈ అర్హతలన్నీ సుబ్బరామయ్యలో కనిపించాయి. రాష్ట్రవ్యాప్తంగా జస్టిస్‌పార్టీ ఎన్నికల తతంగం నడుపుతున్న రావుబహద్దర్ సూర్యారావు నాయుడుగారు స్వయంగా వచ్చి రంగయ్యగారిని అడిగారు. ఆయన చప్పరించేసి, 'అవతల నిలబడేవాడు వయస్సులో చిన్నవాడైనా మేధావి. మావాడికీ ఆయనకీ వయస్సులో తప్పిస్తే పోలికలేదు. నెగ్గని పెట్టని ఎన్నికకిఎగిరి డబ్బుతగలెయ్యటం నా మతం కాదు.' అన్నారు.

అంత సులువుగా పోనిచ్చే వారైతే నాయుడు గారు రావుబహద్దర్ అయ్యేవారే కాదు.

'రంగయ్యగారూ, మీ పిల్లవానికి యేది వుండినా లేకపోయినా సుబ్బరమైన కులం వున్నది' అన్నారాయన తెచ్చిపెట్టుకున్న యాసతో.

'అదేమిటండీ, కాంగ్రెస్ అభ్యర్థికి కులం తక్కువేమిటి ? బ్రాహ్మడు !' అన్నారు రంగయ్య గారు.

'అదే కులంతక్కువంటే !' అని అర్థయుతంగా దళసరి అద్దాల కళ్లజోడు మెరిపించారు నాయుడుగారు. ఆయన మేధావిఅని భయపడకండి. మేధస్సు వోటర్లకు అర్థంకాదు. కులం అర్థమవుతుంది. కొద్దిపాటి డబ్బుఖర్చుకు వెనుకాడబోకండి. పిల్లవాడి జాతకం మంచిదికనుకనే నేను స్వయంగా మీ యింటికి వచ్చానని భావించండి. నామాట కాదనబోకండి.'

ఆ యెన్నికల్లో ఎక్కడచూసినా కాంగ్రెస్ అభ్యర్థులు వోట్లన్నీ వూడ్చేసుకున్నారు. జస్టిస్ పార్టీ అభ్యర్థులు కలికంలోకి లేకుండాపోయారు. కాని సుబ్బరామయ్యమాత్రం, నాయుడుగారి వాగ్బలం మూలానో, తన జాతకబలంమూలానో, కులం బలం మూలానో కాంగ్రెస్ అభ్యర్థిని కొద్దివోట్ల తేడాతో వోడించాడు.

అప్పటినుంచీ సుబ్బరామయ్యజాతకం చక్కటి దాఖలా యిచ్చింది. ఎసెంబ్లీ రద్దుకావటంతో, సభ్యత్వం ఎక్కువకాలం నిలవలేదుకాని, సుబ్బరామయ్య త్వరలో జిల్లాబోర్డు సభ్యుడు అయ్యాడు. రాష్ట్రం మొత్తంలోనే అతను జిల్లాబోర్డు సభ్యులందరిలోనూ చిన్నవయస్సువాడుగా పేర్కొనబడ్డాడు. గవర్నరుగా వృద్ధిలోకి వచ్చేవాడుగా అతన్ని వొకకంట కనిపెట్టి వుంచేవారు. త్వరలో జిల్లాబోర్డుప్రెసిడెంట్‌కూడా అయ్యాడు. అప్పటినుంచీ 'సుబ్బరామయ్యగారు'గా వ్యవహరింపబడ్డాడు.

పదిహేను సంవత్సరాలు జిల్లాబోర్డు ఛైర్మన్‌గిరీ చలాయించి సకాలంలో సుబ్బరామయ్యగారు జస్టిస్ పార్టీ వదలిపెట్టి కాంగ్రెస్‌లో జేరిపోయారు. స్వతంత్రం వచ్చేనాటికి ఆయన వొక కాంగ్రెస్ నాయకుడుగా, గొప్ప జాతీయవాదిగా పరిగణించబడ్డారు. ఒకటి రెండు సవత్సరాలు మంత్రిపదవి కూడా అలంకరించారు గాని, ఆయన జిల్లా రాజకీయాల్లోనే ఎప్పుడూ శ్రద్ధ వహించేవారు. 'జిల్లా వదలి రాష్ట్ర స్థాయికి వెళ్లే రాజకీయవాది నేలవిడిచి సాము చేసినట్లే. రాష్ట్రం వదలి కేంద్రానికి వెళ్ళటం తనచేతి గొడ్డలితో తన కాళ్ల నరుక్కున్నట్లే', అని ఆయన సిద్ధాంతం.

రాజకీయాలు అధికారానికీ, తద్వారా వ్యక్తిగత సౌకర్యానికీ మార్గంగా మాత్రమే పరిగణించిన రాజకీయ వాదుల్లో మనదేశంలో మొదటి వర్గానికి చెందినవారు సుబ్బరామయ్యగారు. ఇందులో ఏవిధమైన ఆదర్శవాదిదృక్పథమూ కలగలుపు చేయలేదాయన.

అందుకే, తన ఏకైకపుత్రుడు రంగారావు కమ్యూనిస్టుపార్టీలో పదిహేనవయేటనే జేరాడని విని ఆయన ఎక్కువగా మనశ్శాంతి పోగొట్టుకోలేదు. పైపెచ్చు అదొక హాస్యకర విషయంగా తీసుకుని, 'హహ్హాహ్హా, నేను జస్టిస్‌పార్టీ పవర్లో వున్నప్పుడు జస్టిస్‌లోనూ, కాంగ్రెస్ పవర్లో కొచ్చాక కాంగ్రెస్ లోనూ వోవెలుగు వెలిగాను. నా జిల్లాలో ఎప్పుడూ నేనెన్ని అక్రమాలు చేసినా, అధికారం నాది గానే వుంది. రాబోయేది కమ్యూనిస్టు తారేమో యెవరికి తెలుసు ! నా వారసుడు నా కొడుకేమో ! సుబ్రహ్మణ్యశాస్త్రిగారిచేత వాడి జాతకం రాయించాలి. ఇన్నాళ్లూ అశ్రద్ధచేశాను' అన్నారు భార్యతో.

కమ్యూనిస్టులతో తిరుగుతున్నందుకు రంగారావుని ఆయనెప్పుడూ మందలించలేదు. పైగా అనేకసార్లు తన సహజ హాస్య ధోరణితో రాజకీయ చతురత మేళవించి చిన్న చిన్న పిడివాదాలుకూడా వేసుకునేవారు.

ఒకరోజు రంగారావు చాలా కోపంగా మాట్లా

డాడు తండ్రితో: 'నాన్నా, మొన్న నువ్వుచేసిన ఘోరం క్షమించరానిది' అని ప్రారంభించాడు.

'ఒరేయ్, పాడుపుకథల్లా మాట్లాడ్డం మానె య్యరా, తండ్రీ. మొన్నటిరోజు నేను ఒక్కగా నొక్క ఘోరంచేసుంటే, అదేమిటో నాకు వెంటనే తెలిసేది. మా వృత్తిలో తెల్లారితే అనేక ఘోరాలు చేస్తూవుంటాం. ఏ ఘోరమో విడమర్చి చెప్పక పోతే యెలా తెలుస్తుంది ? ఒకవేళ మొన్న వొక్క ఘోరమేచేసినా, అది నిన్నచేసిన ఘోరాలకింద మణిగి మాయమైపోతుంది.' అని పళ్లికిలించారు సుబ్బరామయ్యగారు.

'నువ్వు చెబుతోన్న మాటలు నిజమని తెలి యకపోతే నాకూ నవ్వొచ్చేది' అన్నాడు రంగారావు ముక్కుపుటా లెగరేసి. 'నేను మాట్లాడుతున్నది పెద్దచెరువుఘోరం గురించి.'

పెద్దచెరువుకింద ఇరవై ముప్పైమంది చిన్న రైతులు వంద యెకరాలు వ్యవసాయం చేసుకుంటూ వుండేవారు. కాని వెంకటేశ్వర్లు అనే పెద్దరైతు ఆ వందయెకరాల ప్రక్కగా 70 ఎకరాలు కొన్నాడు. బుల్‌డోజర్లు తెప్పించి ఆ భూమి పల్లంచేయించాడు. చెరువునీరు తన కియ్యవలసిందని అధికార్లుల్ని కోరాడు. ఇదివరకు చెరువుకింద నీ రుపయోగించు కుంటున్న వాళ్లకి లేకుండా చెయ్యటానికి కలెక్టరు వొప్పుకో లేదు. కలెక్టరు బదిలీ చెయ్యబడ్డాడు. రెవెన్యూ బోర్డు మెంబరు అడ్డువేస్తే ఆయనకూడా బదిలీ అయ్యాడు. వెంకటేశ్వర్లుగారి పొలానికి నీరివ్వాలని గవర్నమెంటు ఆర్డర్లుకూడా జారీ అయ్యాయి. ఇదంతా సుబ్బరామయ్యగారి మద్దతు వెంకటేశ్వర్లుకి లభించటంవల్లే జరిగిందని అందరికీ తెలిసింది.

సుబ్బరామయ్యగారు మళ్లీ లేలిగ్గా నవ్వేశారు: 'నీకే దేశవాళీ కమ్యూనిజం బాగా వంటబట్టి నట్లుందిరా అబ్బాయ్ ! ఏదో 'ఘోరం' అంటే, నిజంగానే యేదో కంట్రాక్టుసంగతో, పాలపొడి సంగతో, ఎరువుల పంపిణీసంగతో, బియ్యం రవాణా సంగతో అనుకున్నాను. ఈ చిన్న విషయాన్నికూడా 'ఘోరం' అని వర్ణించావంటే, నువ్వు శబ్దరత్నా కరం తిరగరాసేలాగున్నావురా రంగా !'

'కాకుల్నికొట్టి గ్రద్దలకి వెయ్యటంకన్నా ఘోరం ఏం కావాలి ?' అన్నాడు రంగారావు ఉద్రేక పడి.

'వెంకటేశ్వర్లుత్త ఆశపాతకుడురా. వాడి ఆశ వాణ్ణే కొడుతుంది. నాకేం మధ్యలో ?'

'మీ ప్రమేయం లేకుండానే అర్డరేయించు కున్నాడా వెంకటేశ్వర్లు ?'

'నా ప్రమేయం లేకుండా ఈ జిల్లాకి సంబం ధించినంత వంకూ గవర్నమెంటు కాంపౌండ్లో గడ్డి పోచకూడా కదల్దురా బాబిగా !'

'మరి ?'.

'మరీలేదు, గిరీలేదు. వెంకటేశ్వర్లు కోర్టులో ఎల్లాగా వోడిపోతాడు. ఈ లోపల పార్టీ ఫండుకి వా డెంతిచ్చాడో నీకు తెలియదు.'

'పార్టీఫండు, పార్టీఫండు ! దానికోసం మీ పార్టీవాళ్లు చెయ్యని అత్యాచారాలు ప్రపంచకంలోనే లేవు.'

'మమ్మల్ని మరీ అంతగా మెచ్చేసుకోకురా రంగా ! ప్రపంచకంలోనే లేవనటం కేవలం అతిశ యోక్తి.' అన్నారాయన బిడియంగా. 'రష్యన్లు హంగరీని ఆక్రమించుకోటం పార్టీకోసం కాదంటా వేమిటి కొంపతీసి ? స్టాలిన్ చేసిన హత్యలూ అక్రమాలూ పార్టీకోసమేగాని, ఆయనకేం అవసరం?'

'కావచ్చు కాకపోవచ్చు. పార్టీ ఫండ్‌కోసం మాత్రంకాదు. కొద్దిడబ్బు కాశించి బీదసాదల్ని పొట్టలు కొట్టడం మీ పార్టీకేం లాభం? రేపు వాళ్ల వోట్లు మీకు వేస్తారా పోనీ ?

'ఓరి వెర్రివాడా, మోతుబర్లని ఆకట్టుకో కుండా బీదవాళ్లవోట్లు పడతాయనుకుంటున్నా వేమిటి ? ఇల్లాగయితే రాజకీయాల్లో నువ్వెప్పరాతికి మారవురా వెర్రినాయనా. మీ పార్టీ పెద్దల్నే చూడ రాదూ, ఈ వూళ్లో పార్టీలో ముందు నిన్ను జేర్చు

కున్నారుగాని, మన సత్తెయ్యగారి సూరీణ్ణి జేర్చుకున్నారా ?'

'వాడు జేరితే వొద్దంటారేమిటి ?'

'వొద్దనెందు కంటారు ? పోస్టర్లంటించటానికి, తడికలు మొయ్యటానికీ, అరవటానికీ పోట్లాటేదేనా వొస్తే బుర్రలు పగలగొట్టించుకోటనికీ కొంతమంది వాజమ్మల్ని జేర్చుకోనూవచ్చు కాని నాయకత్వానికి నీబోటిగాడే వుండాలి.'

'ఏమిటో నా ప్రత్యేకత ! మీ అబ్బాయినని కాబోలు !'

'సరిగ్గా చెప్పుకున్నావు! పంతులమ్మల్ని కోరిన చోటికి బదిలీలు చేయించీ, కంట్రాక్టర్లకి లాభసాటిగా కంట్రాక్టిప్పించీ, బియ్యం యెగుమతి పర్మిట్లు సరిసమానంగా సరఫరా చేయించీ, అన్ని విధాలా పార్టీ ఫండు సవ్యంగా వసూలయ్యేందుకు తగిన పరిస్థితులు కల్పించీ, ఒక జీవితకాలం ప్రజాసేవచేసి నేను కొంత డబ్బూ పలుకుబడీ మూటకట్టాను. రేపు ఈ డబ్బూ పలుకుబడీ నీకుపయోగిస్తాయని మీ పార్టీ పెద్దల అంచనా. మీ తాత మోతుబరి గనకనే నన్ను జస్టిస్‌పార్టీ వాళ్లు ఎన్నికల్లో నిలబెట్టారు. నేను మోతుబరిని కనకనే కాంగ్రెస్‌వాళ్లు, నా తప్పులన్నీ క్షమించి నన్ను జేర్చుకున్నారు. మీ పార్టీవాళ్లు వొచ్చే ఎన్నికల్లో నామీద పోటీకి నిన్నే నిలబెట్టినా నేను ఆశ్చర్యపోను.'

'నువ్వు చిత్తుగా వోడిపోయినా ఆశ్చర్యపోవనుకుంటాను' అన్నాడు రంగారావు కసిగా.

సుబ్బరామయ్యగారు గట్టిగా నవ్వారు.

*   *   *

ప్రపంచ రాజకీయాల్లో కమ్యూనిజానిదే పై చెయ్యవుతుందని రంగారావు ఒకరోజు జోస్యం చెప్పాడు.

'అయితే మంచిదేలేరా రంగా ! అప్పుడేనాసరే, నువ్వుమాత్రం జిల్లా రాజకీయాలు వొదలకు. కాంగ్రెస్ రాజ్యంలో అయితే పైకెళ్లినవాళ్లు పలుకుబడే పోగొట్టుకుంటున్నారు గాని, కమ్యూనిస్టు హయాంలో తలకాయే పోగొట్టుకుంటారు — బెరియా లాగ !'

ఆయన బెరియా విషయం ఎత్తడం రంగారావుకి కొంచెం కోపకారణం అయింది : 'బెరియా దేశద్రోహిట. మీరందరూ చేస్తోన్న ఘోరాలకి, కమ్యూనిజం వొస్తే మీకూ మీ అనుచరులకీ అదేగతి పడుతుందేమో చూసుకోండి' అన్నాడు.

ఆయన కొడుకుకోపానికి చాలా ఆనందపడ్డారు :

'అబ్బాయ్, ఎవడు దేశద్రోహి, ఎవడు దేశోద్ధారకుడూ అన్న ప్రశ్న ఎవడిమెడ ఎవడు ముందు దొరికించుకున్నాడూ అన్న దానిమీద ఆధారపడుతుంది. క్రుష్చెవ్‌మెడ బెరియాకి దొరికిపోతే, మీ రందరూ బెరియా భజనలుచేసి, క్రుష్చెవ్‌ని దేశద్రోహి అని ప్రచారం చేసేవారు. ఇంక నా మెడంటావా, నువ్వు పార్టీలో వున్నావుగాబట్టి దానికేమీ ప్రమాదం రాదు. నా అనుచరులంటావా, ఒకటే జ్ఞాపకం వుంచుకో ! మనదేశం చేరేసరికి మతాలన్నింటికి వడదెబ్బ తగిలి పోతుంది.'

కొడుకు : హిందూమతం తప్ప.

తండ్రి : పొరపాటు. హిందూమతం మతంకాదు.

కొడుకు : అబద్ధం.

తండ్రి : ఒకప్పుడు మతమేమోకాని ఇప్పుడుమాత్రం కాదు. మతం అన్నదానికి మూడు లక్షణాలున్నాయి : ఒకటి: దాని అనుయాయులు దాని వ్యాప్తికిగాని రక్షణకుగాని ప్రాణాలు ఇయ్యటానికిగాని తియ్యటానికిగాని తయారుగా వుండాలి. రెండు : వాళ్లందరూ రోజూగాని, వారం వారంగాని, ఒకచోటజేరి మత విషయాలు చర్చించాలి. మూడు : గురువులు ఎప్పుడేది చెపితే అదే నిజమని ఒక దృఢమైన నమ్మకం కలిగివుండాలి.

కొడుకు : నాలుగోది చెప్పలేదు. దేవుడుగాని, అనేక మంది దేవుళ్లుగాని ఉన్నారని నమ్మకం వుండాలి.

తండ్రి : అబ్బే అక్కర్లేదు. బౌద్ధమతం అసల్లో నాస్తికమతంట తెలుసా. దేవుడున్నాడా లేడా అన్న దానిమీద నిశ్చితాభిప్రాయంకూడా అవసరంలేదు. మతగురువులమీదమాత్రం నమ్మకం ముఖ్యం. మూఢనమ్మకమైతే మరీ మంచిది.

కొడుకు : మతం గురించి నీ సిద్ధాంతాలు వింటూ కూర్చోడానికి నాకు ఓపికలేదునాన్నా ! ఇంకా అన్నంకూడా తినలేదు. కమ్యూనిజం గురించి మాట్లాడుతూ మధ్యలో మతం గోలలోకి దిగుతా వెందుకు ?

తండ్రి : కమ్యూనిజం ఒకమతం గనక ! నేనిప్పుడు చెప్పిన మూడు లక్షణాలూ దాని కున్నాయి గనక !

కొడుకు : కమ్యూనిజం మతమేమీకాదు. మాకు మతమంటే పూర్తిగా చుక్కెదురు తెలుసా ?

తండ్రి : చుక్కెదురు నిజమే. అది మీకు పరమత సహనం లేదన్న నిజాన్ని నిరూపిస్తుంది.

కొడుకు : అయితే మా మతానికింకా వడదెబ్బ తగల్లే దన్నమాట, ఇండియా చేరినప్పటికీ !

తండ్రి : చేరిందిగాని వేరూనలేదుగా. కొద్దిరోజులు వోపికపట్టు. హీనయానం, మహాయానం, శైవం, వైష్ణవం, ద్వైతం, అద్వైతం, విశిష్టాద్వైతం, ⌣ గుర్తు విశిష్టాద్వైతం, Y గుర్తు విశిష్టాద్వైతం, ఇల్లా చీలి పోతుంది.

కొడుకు : మీక్కావల్సింనదే. కాని మీ కోరిక తీరదు లెండి.

ఈ వాదనల్లో తుది మాట కొడుకుదే అవటం సుబ్బరామయ్యగారికి చాలా యిష్టం. ఆయన నవ్వేసి మాట్లాడ కూరుకున్నారు.

*   *   *

సుబ్బరామయ్యగారి 'కోరిక' అనుకోనంత త్వరలో తీరింది. కమ్యూనిస్టుపార్టీ మొదట్లో రెండుగా చీలింది. తరవాత మూడయ్యింది. త్వరలో ఐదయింది. ఈ చీలికల్లో తన కొడుకు క్రమేణా అతివాద వర్గాలవైపుకే మొగ్గుతూవుండటం ఆయనకు మొదట్లో చాలా ఆందోళన కలిగించింది. ఖ్రుష్చెవ్ స్టాలిన్‌ని దుయ్యబట్టిన క్రొత్తలో తన గదిలో గోడకి వ్రేలాడుతున్న స్టాలిన్ ఫోటో తీసివేశాడు రంగారావు. అంతేకాక ఖ్రుష్చెవ్‌పటం అసే మేకుకు తగిలించలేదు. ఈ మార్పులుచూసి ఆయన కొడుకు పార్టీనుంచి విముఖు డవుతున్నాడేమో ననుకున్నాడు. కాని లెనిన్ గోర్కీలపటాలు కదల్చక పోవటంతో ఆయన మనస్సులో కొంత అనుమానం మిగిలి పోయింది.

ఒకరోజు రంగారావు ఒక పెద్దపటం వంటి వస్తువు చంకలో పెట్టుకుని ఇంటికి రావటంతో, 'ఎవరిదిరా అది, ఖ్రుష్చెవ్‌దా ?' అన్నా రాయన ఆత్రంగా. 'ఇవాళ పేపరు చదవలేదేమిటి? ఖ్రుష్చెవ్‌ని కోసిగిన్ తోసిరాజన్నాడు.

'ఖ్రుష్చెవ్ పాటోకూడా పెట్టాలి! దౌర్భాగ్యుడు !' అన్నాడు రంగారావు పొగలుకక్కుతూ.

'ఛా ఛా, యాభైయేళ్ల కమ్యూనిస్టు హయాంలో హాస్యసరళివున్న నాయకు డొకడు బయల్దేరితే, తిట్టిపోస్తావు, ఏంపాపం చేశాడురా !'

'ఏం చేశాడా, పార్టీకి పుట్టగతులు లేకుండా చేశాడు ! ముప్ఫైయేళ్లు ప్రపంచ కమ్యూనిస్టు నాయకుడుగా వున్నవాణ్ణి రక్తపిపాసి, రాక్షసుడు, అని ప్రచారంచేస్తే పార్టీకి ఎంతదెబ్బ !'

'ఖ్రుష్చెవ్ నిజం చెప్పాడేమోనని ఎందు కనుకోవురా ?'

'పార్టీకి దెబ్బతగిలేనిజం ఏ కమ్యూనిస్టూ చెప్పడు !'

'గోర్కీ నవలలూ, కథలూ, నాటికలూ చదివావు కదురా !'

'ఆ, చదివాను.'

'నిజం అన్నింటికంటె ముఖ్యం అని రాశాడేమో ?'

'రాసుండొచ్చు. ఇప్పుడు గోర్కీ గొడవెందుకు?'

'అబ్బే, నువ్వు నిజంకంటె కమ్యూనిజం ముఖ్యం అంటుంటేను !'

'నీకీ గోర్కీ భక్తి ఎన్నాళ్లనుంచి కలిగిందేమిటి ?'

'అబ్బే. మాకు గోర్కీ ఎందుకురా, మేం గాంధీగారి శిష్యులం.'

'ఆ, తెల్లారితే మీ పార్టీవాళ్లు ఆడే అన్ని నిజాలు గాంధీగారు కూడా ఆడుండరు.'

'అవేరా, మీరు హింసాయుతంగా గోర్కీని హత్య చేస్తోంటే, ఇంచక్కా మేం అహింసాయుతంగా గాంధీని హత్య చేసుకుంటున్నాం.' అని తన హాస్యానికి తనే పెద్దగా నవ్వారు సుబ్బరామయ్యగారు.

'మీ గోర్కీల్నీ గాంధీల్నీ నెహ్రూల్నీ మీ బూర్జువా విలువల్నీ నిలువులోతులో ఊరదొక్కే రోజులు దగ్గర పడుతున్నాయి లెండి.'

'ఊరదొక్కితే మంచిదేలేరా. నువ్వు నాయకుడివైపోతే నేను పింఛను పుచ్చుకుంటాను. నువ్వు మాత్రం జిల్లాస్థాయి వొదలకు !'

'నీలా పదవికోసం పాకులాడటం నా కలవాటు లేదు. నేను నమ్మిందానికి ప్రాణం ఇస్తాను.'

'ఇప్పుడే నిజం ఒక బూర్జువా విలువకింద జమ కట్టేశావు. ఇంతలోనే నమ్మిందానికి ప్రాణం ఇస్తానంటావు. ఇది కూడా బూర్జువా తత్వమేనేమో ఆలోచించు. ఒరే రంగా, నా అంత అయ్యేదాకా భగవంతుడు నీకు ఆయుర్దాయమే యిస్తే, నమ్మినదానికంటె ప్రాణం అనేకరెట్లు విలువైందని తెలుసుకుంటావు. ఇతరుల ప్రాణంకంటెకూడా స్వంతప్రాణం విలువైందనికూడా తెలుసుకుంటావు. మీ నాయకులందరూ ఈ సత్యం గ్రహించినవాళ్లే. ప్రస్తుతం నువ్వేదో దురభిప్రాయంలో పడివున్నా, ఇత విలువైన ప్రాణం యిచ్చేముందు, ఆ నమ్మిందేమిటో ముందు తేల్చుకో. మొన్నటిదాకా కోటలా దుర్భేద్యంగావున్న ప్రపంచ కమ్యూనిజం, నిన్న చిల్లపెంకులా పగిలింది. అందులో ఏ ముక్కకోసం నీ ప్రాణం ఇచ్చేస్తావో కొంచెం నిదానించి మరీ చూసుకో. అటుమొన్న లెనిన్ భజనా, మొన్న స్టాలిన్ భజనా, నిన్న క్రుష్చెవ్‌భజనా, ఇవాళ కోసిగిన్ భజనా చేసుకుంటూ పోయారు. రేపింకోడు బయల్దేరి, 'వీళ్లందరి భజనా శుద్ధ తప్పు, నాభజన చెయ్యండం'టాడేమో ఆలోచించు. మావో అప్పుడే అనేశాడు కూడాను.'

'నువ్వు చేసినంతమంది భజనలు నేను చెయ్యలేదు. కర్జన్‌నుంచి లిన్‌లిత్‌గోనుంచి వేవెల్‌నుంచి మౌంట్‌బాటెన్‌నుంచి నెహ్రూవరకూ అడ్డమైన వాళ్ల భజనలూ మీరు చెయ్యగాలేంది, మేం నమ్మిన నాయకుల భజన మేం చేసుకుంటే తప్పేమిటి?'

'తప్పులేదు, చెయ్యండి. కాని క్షణికమూ బుద్బుదప్రాయమూ అయిన ఈ నమ్మకాలకోసమూ ఈ నాయకుల కోసమూ నశ్వరమైన ఆత్మని త్యాగం చేసుకోకు అర్జునా !' అన్నారు సుబ్బరామయ్యగారు గీతోపదేశం చేస్తున్న కృష్ణభగవానుడి భంగిమను అనుకరిస్తూ. 'రాజకీయవాది ఎప్పుడు ఎవరి భజన చేసినా అది పదవిఅనే కైవల్యపదానికి తాత్కాలిక మైన మార్గమని నమ్ముతాడు. ఆ నమ్మకం ఒకటే రాజకీయవాదికి మోక్షదాయకమని నా జీవితచరిత్రే నిరూపిస్తోంది, ఓ కౌంతేయా !' అని ముగించారాయన భంగిమం కొంచెం మార్చి.

ఆయన భంగిమలు చూసి నవ్వకుండా వుండలేక పోయాడు రంగారావు. 'నీకు ఏదంటేనూ నమ్మకం లేదు, నాన్నా. చివరికి నీ నల్లమందు భగవద్గీతని కూడా వెక్కిరించకుండా వుండలేక పోయావు. మానవ స్వభావంలోనే మీకు నమ్మకంలేదు. నీతో వాదన అనవసరం.' అంటూ తనగదిలోకి వెళ్లిపోయాడు రంగారావు.

హు ! మానవ స్వభావం ! నేను చూసినంత మానవ స్వభావం వీడు చూసుంటే ఇలా మాట్లాడ్డు.

ఐశ్వర్యంలో దొర్లుతూ కొద్దిపాటి డబ్బుకోసం కూతుళ్లని ముసలాళ్లకి అమ్ముకునేవాళ్లూ, ఎలక్షన్లలో కొద్దిపాటి వోట్లకోసం బుర్రలు బద్దలుకొట్టేవాళ్లూ, ఎన్నిరకాల మానవ స్వభావాలు కళ్లారా చూశాను! అని తనలో తాను వితర్కించుకుంటూనే రంగారావు వెనకాల వెళ్లారు. ఎందుకంటే అది ఎవరిపటమో తెలుసుకోటం చాలా ముఖ్యమని తోచిందాయనకి. గోడకి కొత్తగా తగిలించిన పటం చూసి నిర్ఘాంత పోయారాయన! అది మావ్‌ట్సేటంగ్‌ది!

గోర్కీ ఫోటో గోడనుంచి తీసెయ్యటంలో నిమగ్నుడై వున్న రంగారావు తండ్రి రాకని గమనించ లేదు. 'నీ సిద్ధాంతాలు ఇక్కడికి చేరుకున్నాయన్న మాట చివరికి!' అని ఆయన ప్రారంభించేసరికి రంగారావు ఉలిక్కిపడ్డాడు. గిర్రున వెనక్కితిరిగి ఆయనకేసి నేరస్తుడిలాగ చూశాడు ఒక్కనిమిషం.

'కొంచెం దేశభక్తి అలవాటు చేసుకోండిరా! నిన్నగాక మొన్న మన జవాన్లని అంతమందిని పొట్ట నెట్టుకున్నవాడి భజన చెయ్యటానికి చేతులెలా వొచ్చాయిరా!' అన్నారాయన చాలాకోపంగా. 'సామ్రాజ్య వాదుల్ని తిడుతూనే టిబెట్‌ని కలుపుకున్న మహాత్ముడు ఇప్పుడు నీ దేవుడు!' ఇదివరకు ఆయన రంగారావుతో వాదన వేసుకున్నప్పుడల్లా హాస్యధోరణి వ్యంగ్యమూ ప్రయోగించేవారేకాని కోపం చూపించలేదు. ఈసారి వ్యంగ్యం రంగారావు దయింది:

'చేతకాని యుద్ధాలకిపోయి తన్నులుతిన్న మీ నెహ్రూగార్నీ మీనన్‌గార్నీ తిట్టుకోండి' అన్నాడు.

'నెహ్రూ మావాడూ మావో మీ వాడూను! ఏం మాట్లాడుతున్నావో వొళ్లూపై తెలుసుకుని మాట్లాడు.' అన్నారాయన చాలా కోపంగా.

" 'డెమోక్రటిక్ సోషలిజం' అని అరిచినంత మాత్రాన నెహ్రూ సోషలిస్టయిపోడు. హిట్లరూ అన్నాడు 'నేషనల్ సోషలిజం' అని!"

ఆయన కోపం అవధులు దాటింది. 'ఇంకా సిగ్గులేకపోతే సరి! నెహ్రూని హిట్లరుతో పోలుస్తున్నావు. నిన్నటిదాకా మాస్కో, ఇప్పుడు పీకింగూను నీ స్వర్గధామాలు! ఇల్లా నీ కమ్యూనిస్టు స్వర్గంలో జాతీయనాయకుణ్ణి గురించి మాట్లాడితే, బయటికి తీసికెళ్లి, పిచ్చికుక్కని చంపేసినట్లు చంపేద్దురు. ఆ ఫొటో తెల్లారగానే పటు కు పోకపోతే, కిరసనాయిలుపోసి తగలేస్తాను' అని వెనుదిరిగా రాయన.

'మీ యింట్లో తెల్లారేదాకా వుంచుకోనక్కర్లేదు. ఇప్పుడే పట్టుకుపోతాను. మావో ఫోటో వుండకూడనిచోట నేనూ వుండను.' అని గోడనున్న పటం తీసుకుని సుడిగాలిలాగ ఇంట్లోనించి వెళ్లిపోయాడు రంగారావు. తల్లి వెనకనుంచి, 'వొరే రంగా, వొరేరంగా, వొక్కమాట వినరా,' అంటూనే వుంది. కాని రంగారావు చీకట్లోకి నిష్క్రమించాడు.

'ఒక్కగా నొక్క కొడుకుని అర్థరాత్రి ఇంట్లోంచి వెళ్లగొట్టడానికి మీ ప్రాణం ఎలా వొప్పిందండీ.'అంది ఎప్పుడూ ఆయన కెదురాడి ఎరగని భార్య.

'నేను వెళ్లగొట్టలేదు. ఆ ఫోటో ఇంట్లో పెట్టుక్కూర్చుని వాడితోపాటు నేను కూడా జెయిలుకు వెడితే నీ కళ్లు చల్లగావుంటాయా?' అన్నారాయన.

'మీదంతా చిత్రం, ఫోటోకోసమే జెయిలుకి పంపిస్తారా!'అని గొణుక్కుంది ఆవిడ.

ఆ తరవాత మూడురోజులు ఆమె నోరువిప్పి మాట్లాడలేదు. అన్నం తినలేదు. ఆయన కింట్లో అర్ధరాత్రి వెక్కివెక్కి యేడ్పు వినిపించింది. ఇంక ఈ పరిస్థితి భరించలేక నాలుగోరోజు పొద్దుట కొడుక్కు కబురంపించారాయన: తల్లి పరిస్థితి ఇలా వుందనీ, మావోపటంతోసహా ఇంటికి రావలసిందనీ. ఆ రోజు చీకటిపడేవేళకి మావోతోసహా రంగారావు ఇంటికి జేరుకున్నాడు. 'నేను చచ్చిపోయాననుకునే అర్ధరాత్రి అల్లా వెళ్లిపోయావ్రటా రంగా!' అని పెద్దగా తల్లి ఏడుపు వినిపించి, కొడుకు ఇంటికి జేరు

కున్నాడని ప్రక్కగదిలోవున్న సుబ్బరామయ్యగారు తెలుసుకున్నారు.

* * *

ఈ ఉదంతం జరిగినతరువాత ఆయన కొడుకును గురించి ఆందోళనపడటం క్రమేణా తగ్గించివేశారు. అతని రాజకీయా లేవయినప్పటికీ రంగారావు చదువులో ఎప్పుడూ వెనకబడేవాడుకాదు. బియ్యే అఖరి ఏడాదిదాకా మంచిమార్కులతోనే రాగలిగాడు. పెద్ద పరీక్షకూడా యిచ్చేశాడు. కుటుంబంలో ఎవరికీ అబ్బనంత చదువు రంగారావుకి అబ్బటం ఆయనకి చాలా గర్వకారణం అయింది. అతని భవిష్యత్తు విషయంలో ఆయన మానసోద్యానంలో అంతులేని ఆశలు చిగిర్చాయి. ఇండియాకి మొదటి కమ్యూనిస్టు ప్రధానమంత్రి తన కొడుకే అవుతాడని ఆయన కలలు కనేవారు. రాజకీయాలు తమ వంశరక్తంలోవుందని ఆయన నమ్మకం. రాజకీయాలంటే చాకచక్యమూ సమర్థతా వున్నవాళ్ల చేబట్టేవృత్తి అని ఆయన దృఢనమ్మకం. అందుచేత తన కొడుకు తప్పకుండా చాకచక్యమూ సమర్థతా వున్నవాడే అవుతాడుకదా! తను చిన్న వయస్సులో, అనుభవంలేకపోయినా, వేసవి వెనకబట్టగానే అప్పుడే రెక్కలుమొలిచిన కోకిల ఉత్తరాదిని వెతుక్కుంటూ పోయినట్లు, నెగ్గేపార్టీలోకే దారితీస్తూ పోలేదా? నిన్న మొన్న కాంగ్రెస్ చీలినప్పుడుకూడా, తను కొత్తకాంగ్రెస్‌లోనే జేరాడుకాని కొంతమంది తన స్నేహితుల్లాగ పాతకాంగ్రెస్‌లోజేరి పతనం కొనితెచ్చుకోలేదు. పైగా కాంగ్రెస్ 'N' అంటే 'నెగ్గే కాంగ్రెస్'అనీ 'O' అంటే 'ఓడిపోయే కాంగ్రెస్'అనీ చమత్కరించేవాడుకూడా. ఒక జీవితకాలం ఏ సహజ చాతుర్యం తనను నెగ్గేవైపుకే ఉంచగలిగిందో అదే సహజచాతుర్యం తన కొడుకునుకూడా అతివాదకమ్యూనిస్టుల్లోకి మళ్లించివుంటుందని ఆయన సరిపెట్టుకున్నారు.

అందుకే, రంగారావు చేతులో 'రెడ్‌బుక్'అనే మావో సూక్తిముక్తావళి చూసినప్పుడుకూడా ఆయన ఎక్కువ ఆందోళన వ్యక్తంచెయ్యలేదు. మావో పటం విషయంలో తన సహజహాస్యధోరణి వదలి కోపం చూపించటం పెద్దపొరపాటయిపోయిందని ఆయన అనుకున్నాడు.

'ఒరే రంగా, వినటమేగాని ఈ రెడ్‌బుక్ ఎప్పుడూ చూసేభాగ్యం కలగలేదురా. ఓసారి చూణ్ణియ్యి.'అని తీసుకుని కొన్ని మావో సూక్తులు పఠించాడాయన: 'అధికారం తుపాకిగొట్టంలో పుట్టి పెరుగుతుంది.'అని చదివి 'ఓహోహో, ఏమి సూక్తిరా! తుపాకి గొట్టంలోంచి అధికారమే అన్న మాటేమిటి? పొగ పుట్టదూ? గంధకం కంపు పుట్టదూ? హత్య, దోపిడీ, గృహదహనం, మానభంగం, ఇత్యాదయః అన్నీ అందులోనే పుడతాయి, పెరుగుతాయి. అధికారం అన్నావా, అప్పుడప్పుడది వోట్లపెట్టెలోంచి కూడా పుడుతుంది. కావాలంటే మీ నంబూద్రిపాద్‌ని అడుగు. అచ్యుతమీనన్‌నేనాసరే! చివరికి నన్నేనాసరే! తుపాకీ మొహం చూడకుండా, దాని అవసరంలేకుండా, నలభైయేళ్ల అధికారం చవిచూశాను. మరో సూక్తి: 'పల్లెలు పట్టణాల్ని చుట్టుముట్టడిస్తాయి' ఈ మాట నిజమే. ఈ సత్యం నేను మావో రచనలు చదవకుండానే గ్రహించాను. అందుకే నేను జిల్లాస్థాయి వొదలకూడదన్నాను. బస్తీల్లో యేముందిరా! నేలవిడిచి సాము తప్పిస్తేను!'

'నాన్నా, మావోని వెక్కిరించే తాహతు నీకు లేదు. ఏసూక్తులూ సిద్ధాంతాలూ మీ పార్టీవాళ్లని కట్టెయ్యలేవు. 'సోషలిజం' మీ సూక్తి. బీదాబిక్కీని దోచుకోటం మీ సిద్ధాంతం. మీ రోజులు దగ్గరపడ్డాయని మీకు తెలుసు' అన్నాడు రంగారావు పళ్లుకొరికి.

ఆయన నవ్వారు. 'రంగా, పళ్లుకొరకటం మంచిలక్షణం కాదురా. పొట్టలో నులిపురుగు లున్నాయేమో చూసుకో. మేం బీదాబిక్కీని దోచుకుని వొదిలేస్తామేమోగాని, మీరు స్వప్రయోజనాలకోసం వాళ్లని అంతూ దరీలేని యుద్ధాల్లోకి దింపి మాటల్తో అరిచేతుల్లోనూ చేతల్తో బొందితోనూ స్వర్గం చూపిస్తారు. పోనీ పునర్జన్మ స్వర్గమూ దేవుడూ

అంటేనమ్మకంవున్నవాళ్లయితే,వీరస్వర్గంఅలంకరిస్తారని అనుకునేవాళ్లు వెనక. మీకా నమ్మకాల్లేవుకదా, మీ విప్లవాల్లో, మీరు నెత్తిమీద చెయ్యిపెట్టిన దేశాల్లో సగం జనాభా చచ్చాక, చచ్చినవాళ్లకి ఏం నష్టపరిహారం ఇస్తారో చెప్పరా!'

'ముందుతరాలవాళ్లు బాగుపడతారు.'

'ముందుతరాలవాళ్ల మాటొదిలెయ్. చచ్చిన వాళ్ల కేం లాభమో చెప్పవోయ్!'

'మీలాంటి నాయకుల ధర్మపాలనలో పెద్ద చెరువు రైతుల్లా సగంచచ్చిబతక్కుండా ఒక్కసారి చావటమే మంచిది.'

'అబ్బాయ్, మీ మతపిచ్చి వంటబట్టనివాళ్ల నెవళ్లనేనా అడుగు. అంతలోఅంత బతకటమే మంచి దనుకుంటారుగాని, మన స్మరణలోవున్న వాళ్లెవరూ చావటం మంచిదనుకోరు. లేకపోతే, యావజ్జీవ ఖైదీలూ బానిసలూ, మీ కమ్యూనిస్టు స్వర్గంనుంచి సైబీరియాకి ఎగుమతైపోయిన మందభాగ్యులూ ఆత్మ హత్యలు చేసుకుందురు. పెద్దచెరువు సంగతెత్తావు గనక చెబుతున్నాను: ప్రజాస్వామ్యంలోవున్న అందం అదే. హైకోర్టోల్ల చిన్నరైతులు నెగ్గలేదా? నే నానాడే చెప్పాను వెంకటేశ్వర్లు ఆశ వాణ్ణే కొడుతుందని.'

'ఈలోపల కొన్నేళ్లు బీదవాళ్లకి నీళ్లులేకుండా చేసి వాళ్లని సగం చంపలేదూ?'

'అదే నే చెప్పేది. మీరైతే పూర్తిగా చంపేద్దా మంటారు. మాకూ మీకూ తేడాయే అది.'

రంగారావు మొహం మళ్లీ ఎర్రబడింది: 'మోతుబర్ల మద్దతుతో వోట్లులాగి, పెద్దవాళ్లు ఎగవేసిన పన్నులభారం చిన్నవాళ్లమీద రుద్దీ, బియ్యం రవాణా పెర్మిట్లమీద ఎన్నికల చందాలు వసూలుచేసీ, మీరు ప్రజల్ని దోచుకోకపోతే విప్లవాలూ అక్కర్లేదు, చావులూ అక్కర్లేదు. దోపిడిమానేస్తే మీ పదవులు అప్పుడే ఊడిపోతాయి. మీ సమాజాన్ని పాతెయ్యాలి. మీకు ముందుచూపులేదుకనకనే రేపు రాదన్నట్లు మేడలమీదమేడలు కట్టిస్తున్నారు. ఇదే మా కుప యోగపడుతోంది. మీ రోజులు దగ్గరపడుతున్నాయి!' అంటూ రంగారావు వెళ్లిపోయాడు.

'ఏంమాటలురాఅవీ, పెద్దాపిన్నా లేకుండాను, అంటూ నొచ్చుకుంది తల్లి.

'అన్నియ్యావే, పెద్దాపిన్నా అన్నవి బూర్జువా విలవలు. నీకు తెలియవులే. కొంత ఆవిరి వొదిలి పెట్టేస్తే వాడికి మనశ్శాంతి!'అని పెద్దగా నవ్వారు సుబ్బరామయ్యగారు.

* * *

ఆవిరి వదలిపెట్టెయ్యటంవల్ల రంగారావుకి ఏంతమాత్రమూ మనశ్శాంతి లభించలేదని తెలుసుకో టానికి సుబ్బరామయ్యగారికి ఎక్కువరోజులు పట్ట లేదు.

ఒకరోజు పోలీస్ సూపరింటెండెంటు కబు రేనా లేకుండా జీపులోవచ్చి యింటిముందు దిగేసరికి సుబ్బరామయ్యగారు ఆశ్చర్యపోయారు. 'రండి రండి సూపరింటుగారూ' అంటూ ఆహ్వానించారు.

సూపరింటెండెంట్ ఆహ్వానాన్ని ఎక్కువ లెక్క చెయ్యకుండానే, 'మీతో ఒక ముఖ్యమైన విషయం మాట్లాడాలి' అన్నాడు అక్కడ ఉన్నవారివైపు అర్థ యుతంగా చూస్తూ.

'రండిరండి లోపలికిరండి'అంటూ లోపలిగది లోకి తీసుకెళ్లారాయన.

బయట ఎవరికీ వినిపించదని ధైర్యంతోచిన తరువాత సూపరింటెండెంట్ 'హోం మినిస్టర్‌గారు మీకోమాట రహస్యంగా చెప్పమన్నారు. మీవాడు నక్స లైట్‌లతో లాలూచీ అవుతున్నాట్ట. పరిస్థితి చాలా ప్రమాదకరంగాఉంది.'

'ఎవరు మావాడు?'

'మీ అబ్బాయి రంగారావు.'

సుబ్బరామయ్యగారి ముఖం మొదట పాలిపోయి తరువాత ఎర్రబడింది. 'ఏమిటి సూపరెంటుగారూ మీరనేదీ? మినిస్టరుగారి కీ తప్పుడుసమాచారం ఎవ

రందించారు? ఈ జిల్లాలో నక్సలైట్ బెడద లేదని మీకు తెలియదా?' అన్నారు సూపరింటెండెంట్‌కేసి నిందాపూర్వకంగా చూస్తూ.

'ఈ జిల్లా కేసయితే మీవాణ్ణి కాళ్ళూ చేతులూ కట్టితీసుకొచ్చి మీముందు పడేసేవాణ్ణి. మినిస్టర్ దాకా పోనిస్తానా! మీవాడిప్పుడీ జిల్లాలో లేడు.'

'అవును, విజయవాడ వెళ్తానని వెళ్ళాడు స్నేహితుడి దగ్గరకి. ఇవాళ్టికి వారం అయింది.'

'అదే, ఆ వెళ్ళటం, శ్రీకాకుళం జిల్లాలో నక్సలైట్ ప్రాంతాలకి జేరుకున్నాట్ట. వాళ్ళూ పోలీసులూ ఎదరపడితే వాళ్ళో వీళ్ళో అన్న పరిస్థితి ఇప్పుడు. అందుకే మినిష్టరుగారు నన్ను స్వయంగా మీకు చెప్పమన్నారు.'

జీవితంలో మొట్టమొదటి సారిగా ఆయన ధైర్యాన్ని కోల్పోయారు. పైగా అధైర్యాన్ని రెండో వాళ్ళముందు చూపించారు. 'ఏంచెయ్యాలి సూపరింటుగారూ, నేనేం చెయ్యాలి? వాడికేదేనా అయితే వాళ్ళమ్మ బతకదు. నే బతకను. ఏం చెయ్యాలో చెప్పండీ, మీకు పుణ్యం వుంటుంది.' అన్నా రాయన కంఠస్వరం హెచ్చించి.

'గట్టిగా మాట్లాడకండి. మీరు కంగారుపడకండి. ఇంట్లో హైదరాబాద్ వెళ్తున్నట్లు చెప్పి నాతో బయల్దేరిరండి. దార్లో మాట్లాడుకుందాం.' అన్నాడు సూపరింటెండెంట్.

'మినిస్టరుగారి దగ్గర్నుంచి కబురొచ్చింది. నే నర్జంటుగా హైదరాబాద్ వెళ్ళిపోవాలి.' అని భార్యతోనూ బయటిగదిలో ఆయనకోసం వచ్చి కూర్చున్నవాళ్ళతోనూ చెప్పి ఆయన బయల్దేరారు.

సూపరింటెండెంట్ మఫ్టీలోవున్న ఒక పోలీసు జవాన్ని తోడిచ్చి శ్రీకాకుళం పంపించాడు. అక్కడ 'నక్సలైట్' డ్యూటీలోవున్న ఒక సర్కిల్ ఇన్‌స్పెక్టరు, సుబ్బారెడ్డి, సుబ్బరామయ్యగారికి బాగా తెలిసివుండటం ఆయనకి చాలా ఉపకరించింది.

రంగారావును ముఖాముఖీ కలుసుకో గలిగితే తను ఎల్లాగో ఒకలాగ అతన్ని తిరిగి తీసుకురాగలనని ఆయన ధైర్యం. అతన్ని కలుసుకోటం ఎలాగా అన్నదే పెద్ద సమస్య అయింది.

'మేం గనక మీతోవస్తే, మా ప్రాణానికీ మీ ప్రాణానికీ కూడా ముప్పే,' అన్నాడు సుబ్బారెడ్డి. 'వాళ్ళు చిన్నచిన్నదళాలుగా ఏర్పడి—ఐదుగురు, ఆరుగురు — ఒకచోట్నుం చొకచోటికి తిరుగుతున్నారు. ఎవళ్ళేదళంలో వున్నారో తెలుసుకోటం చాలా కష్టం. పోలీసులు కనిపిస్తే ముందోబాంబు పారేసి మరీ మాట్లాడతారు—మాట్లాడతారంటే, మాట్లాడరనుకోండి—పరిగెడతారు. మేం 'షూట్' చెయ్యాలి సొస్తుంది. మీరు మాతోవుంటే మీక్కూడా ప్రమాదం. ఈ ఖద్దరుపంచా, లాల్చీ, ఈ డ్రస్సులో మీరు కనిపించారంటే, మమ్మల్నొదిలేసి బాంబులన్నీ మీమీదే పారేస్తారు' అన్నాడు సుబ్బారెడ్డి పెద్దహాస్యం వెలిగించినట్లుగా నవ్వుతూ.

మరొక పరిస్థితుల్లోఅయితే, ఆయన కూడా సుబ్బారెడ్డి వీపుచరిచి నవ్వేవారు. కాని ఇది హాస్యానికి సమయం కాదన్నట్లు కనుబొమలు ముడిచి: 'చూడు సుబ్బారెడ్డి, నేను మావాణ్ని కలుసుకోటం ముఖ్యం. మీతో వెడితే పనిజరగదని తెలుస్తోనేవుంది. నేనొక్కణ్ణే వెళ్తాను. నాకు దారిచెప్పండి' అన్నారు.

'ఏదారని చెప్పం సార్, గోదారి?' (సుబ్బారెడ్డి గోదావరిజిల్లాలవాడు) 'పార్వతీపురం, కురుపాం. భద్రగిరి. నీలకంఠాపురం, యివన్నీ వాళ్ళ సెంటర్లేనండీ. కొండలు. గుట్టలు. చెట్లు, పుట్టలూను. ఏ చాట్నుంచో వో బాంబేశారంటే—ఠా. నామాటినండి. వెళ్ళకండి. ముందు పెద్దప్రాణానికే మోసం. మీ అబ్బాయి సంగతా, షూటింగులో దొరికిపోతే చెప్పలేంగాని, అరెస్టయితేమాత్రం, పువ్వుల్లోబెట్టితెచ్చి మీ అబ్బాయిని మీ కప్పచెప్పే బాధ్యత నాది' అని బతిమాలాడు సుబ్బారెడ్డి.

'షూటింగులో దొరికిపోవటం' సంగతి సుబ్బారెడ్డి నోట తెలిగ్గానే వచ్చేసిందిగాని, ఆ మాట వింటూనే సుబ్బరామయ్యగారు గతుక్కుమన్నారు: 'నేను వెళ్ళక తప్పదు సుబ్బారెడ్డీ!' అన్నారాయన.

'తప్పకపోతే వెళ్లండి. నా పూచీమాత్రం లేదు. మీరు వెళ్తోన్నట్లే నాకు చెప్పకండి, మీ కేదేనా అయితే ముందు నామెడ తెగిపోతుంది.'

ఇంత విషమావస్థలోనూ సుబ్బారెడ్డి మాటల తీరుకి ఆయన చిన్న వ్యంగ్యం ప్రయోగించకుండా ఉండలేకపోయారు : 'మరేం పరవాలేదులే సుబ్బారెడ్డీ, నాకేదేనా అయితే, నువ్వు దారిచెప్పి నా చావుకి బాధ్యుడి వయ్యావని ఎవరితోనూ చెప్పనులే, సరేనా!'

ఆయన వ్యంగ్యం సుబ్బారెడ్డిమీద వృధా అయింది: 'ఆ మాటమీదే వుండండి సార్. పోలీసోళ్లం. మాకు ముందుకువెడితే నుయ్యీ వెనక్కివెడితే గొయ్యీని' అన్నాడు.

'నాకు తెలియపుటయ్యా సుబ్బారెడ్డీ, మీ బాధలు ! ఇంతకీ నీకీ దారితెన్నులేమన్నా తెలిస్తే చెప్పు, లేకపోతే ఇంకెవర్నేనా అడుగుతాను' అని బుజ్జగించారు.

సుబ్బారెడ్డికి పౌరుషం కలిగింది : 'నాకు తెలియక పోటమేమిటి సార్ ! నక్సలైట్ ఏరియా అంగుళం అంగుళం ఎరుగుదును. మీరు ముందు పార్వతీపుర మెళ్లండి. ఎవర్నేనా బడిపంతుల్ని పట్టుకోండి-వాళ్లందరూ నక్సలైట్లేలెండి! మీ అదృష్టం బాగుండి వాడు హృదయమున్న నక్సలైట్ అయితే—నక్సలైట్లలోకూడా హృదయమున్నవా ళ్లున్నారులెండి—మీ కేదేనా దారి చూపిస్తాడేమో. అదేనా మీ రెవరో తెలియకపోతేను ! తెలిసిందో, తా! తరవాత నన్నడిగి లాభంలేదు. ముందే చెపుతున్నాను.'

'నిన్నడగన్లే. ఒకవేళ పార్వతీపురంలో నాకు హృదయమున్నవాడు దొరక్కపోతే?'

'హృదయం లేనాడు దొరికితే కథ కంచికే ! తా ! అన్నమాట.'

'ఉన్నవాడూ లేనివాడూ ఆ వూళ్లో ఎవడూ దొరక్కపోతే ఏవూరువెళ్లాలయ్యా !'

'కురుపామెళ్లండి. భద్రగిరి, పాలకొండ, సీలకంఠాపురం, కాకిలికొండలు, చిలకాంకొండలు—అంతా వాళ్ల యిలాకాయేనండీ. దేనికేనా, బడిపంతుళ్లు ముఖ్యమండీ !'

ఆయన యీవూళ్ల పేర్లన్నీ వల్లించుకుని సాధ్యమైనంతగా గ్రామస్తులవేషం వేసుకుని, ముఖ్యంగా కాళ్లకి ఆకుజోళ్లూ తలకి తలపాగా వేసుకుని పంచె పైకెగకట్టి, తనతోకూడావచ్చిన పోలీసు జవాన్ని ఖర్చులిచ్చి వెనక్కి పంపించి బయల్దేరారు.

పార్వతీపురం జేరుకునేసరికి కనుచీకటి పడింది. బడిగా వాడబడుతున్న పెద్ద పూరిగుడిసెని ఆయన సుళువుగానే పోల్చుకో గలిగారు. పక్కనే చిన్న పెంకుటింట్లో చిన్నదీపం కనిపిస్తే వెళ్లి తలుపుతట్టారు. లోపలనుంచి 'ఎవరు ?' అన్నదొక మగగొంతు.

తలుపుతీస్తారా, మీతో మాట్లాడాలి' అన్నారు సుబ్బరామయ్యగారు.

తలుపు తియ్యకుండానే లోపల్నుంచి, 'మీపేరు ?' అని ప్రశ్న.

ఆయన కొంత తటపటాయించి తనపేరు సర్వసామాన్యమైన పేరేగదా, ఏ సుబ్బరామయ్యో ఏం తెలుస్తుందని, స్వంతపేరే చెప్పేశారు.

'ఏవూరు?' అని మళ్లీ ప్రశ్న.

'శ్రీకాకుళం' అన్నారాయన.

'ఏం కావాలి?'

'ఈ బళ్లో పనిచేసే పంతులుగా రెక్కడుంటారు?'

'మీది శ్రీకాకుళంకాదు. అస లేవూరో చెప్పండి' అన్నాడు లోపలిమనిషి.

'అసలువూరు విజయవాడ'అని ఆయన మళ్లీ అబద్ధం చెప్పారు. తనకు శ్రీకాకుళపుయాస లేక పోవడాన్ని లోపలిమనిషి కనిపెట్టేశాడని తెలుసుకుని.

'పంతుల్తో మీకేం పని?'

'పనేమిటో పంతుల్తో చెబుతాను. ఆయన ఉండేచోటు తెలిస్తే చెప్పండి, లేకపోతే ఇంకెక్కడి కేనావెళ్లి అడుగుతాను.' అన్నారు, లోపలిమనిషిని ఇరుకులోపెట్టే ఉద్దేశ్యంతో.

'నేనే పంతుల్ని. ఇప్పుడు చెప్పండి ఏం పనో.'

'మీతో కొంచెం సాయం కావాల్సివొచ్చాను. తలుపుతియ్యండి పంతులుగారూ!' అన్నారాయన సాధ్యమైనంత దీనంగా కంఠస్వరంమార్చి. ఆయన ఎవరితోనూ దీనంగా మాట్లాడి ఎరగరు. ఇప్పుడీ బడి పంతులు గుమ్మంలో నిలబడి ఈ క్రొత్తవిద్య నేర్వ వలసివచ్చిందికదాఅని తనమీద తను జాలిపడ్డారు కూడాను.

లోపలిమనిషి తలుపుతీసి బయటికి తొంగిచూసి వచ్చిన మనిషి ఒక్కడే వున్నాడని తేల్చుకున్నాక 'లోపలికి రండి'అని ఉత్తరువు జారీచేశాడు. లోపలికి జేరుకోగానే దీపంవొత్తి పెద్దదిచేసి సుబ్బరామయ్యగారి ముఖం దగ్గరకిచేర్చి, 'మీరు జిల్లాబోర్డు చైర్మనూ మినిస్టరూ చేసిన సుబ్బరామయ్యగారు. మీరు నన్నెరగరుగాని, నేను మిమ్మల్నిదివరకు రెండుమూడుసార్లు చూశాను. ఈ ప్రాంతాల్లో మీరు వొంటరిగా తిరగటం చాలా ప్రమాదకరమని మీకెవరూ చెప్పలేదనుకుంటాను' అన్నాడు.

'చెప్పారు. వ్యక్తిగతమైన ప్రమాదం గురించి లెక్కచేసే పరిస్థితికాదుగనకనే మీదగ్గరకి వచ్చాను. మీరు నాకు సాయంచెయ్యాలి మేస్టారూ!'

'మీరిక్కడ వుండటం నాక్కూడా ప్రమాదకరం. మీరు నాకెప్పుడూ ఉపకారంచేసి యెరగరు. పైగా నేను పదేళ్లక్రిందట ఉద్యోగంకోసం మీదగ్గరకొస్తే నాకంటె తక్కువ అర్హతలున్నవాణ్ణి వేసుకున్నారు. మిమ్మల్ని నక్సలైట్లు కెందుకు పట్టియ్యకూడదో చెప్పగలరా?'

'పట్టియ్యకుండా వుండటానికి తగినంత కారణం నేనేమీ చెప్పలేను మేస్టారూ. ఆ ప్రమాదం వుందని తెలిసికూడా మిమ్మల్ని వెతుక్కుంటూవచ్చాను.'

'చాలా ముఖ్యమైన పనే అయివుండాలి.'

'అవును, నా కొడుకు రంగారావు నక్సలైట్లలో జేరాడని తెలిసింది. వాడి ఆచూకీ మీరేమైనా ఇయ్యగలరేమోనని ఆశ.'

'నేనెలా ఇయ్యగల ననుకున్నారు?'

'మీ రంటే మీరేకాదు. బడిపంతుళ్లెవరైనా అడిగితే ఫలితం వుంటుందని నాకు తెలిసింది. వాడెక్కడుంటాడో తెలిస్తే చెప్పండి.'

'నాకు తెలియదు కాని ఆచోకీ తెలిస్తే ఏం చేద్దామని?'

'రెండుమాటలు మాట్లాడి వెళ్లిపోతాను. వాడికేదేనాఅయితే తల్లి బతకదు. నేను బతకను. ఇంటికి రమ్మని బతిమాలుతాను. నా జీవితాన్ని వాడెలాచెస్తే అలా మార్చుకుంటానని చెప్తాను.'

'మీరు బతకనంతమాత్రాన మా నక్సలైట్లకేమీ నష్టంలేదు—అని మీ అబ్బాయి అంటేనో?'

'అంటాడు నాకు తెలుసు. కాని వాడి ఆశయాలు నెరవేరటానికి సాయం చేస్తానంటే...'

'మీ వర్గంద్వారా మా ఆశయాలు నెరవేరవని తెలుసుకున్నాకే ఇందులో జేరానంటాడేమో!'

'అదికూడా అంటాడు. కాని మనుషులు హేతువాదమే దృష్టిలో పెట్టుకుని అన్ని నిర్ణయాలూ చేసుకోరని నాకు అనుభవంద్వారా తెలుసు. ఒక కన్నీటిబొట్టు జీవితాల్ని మార్చేసిన సంఘటనలుకూడా వున్నాయి. మనుషుల్నందర్నీ వర్గాల మూసల్లోకి ఇరికించేసెయ్యటం అస్తమానం సాధ్యంకాదు మేస్టారూ. ఇదంతా బూర్జువా నల్లమందని మావాడంటాడు. తల్లి కమ్యూనిస్టైఅయినా, మార్క్సిజం వ్యాప్తికోసమే కొడుకు చచ్చిపోయినా, ఏడవటం మానదు.' ఆయన తనకు తానే చెప్పుకుంటున్నట్లు చెప్పుకుపోతున్నారు.

'సుబ్బరామయ్యగారూ, ఈ కన్నీటిబొట్లూ, కొడుకుని పోగొట్టుకున్న తల్లియేడ్పూ, ఇవన్నీ ప్రపంచకంలో వున్నాయన్న గుర్తింపు, మీ కొడుకు ప్రాణంమీది కొచ్చిందికనక, మీ కివాళ కలిగింది' అన్నాడు. అతని ముఖం ఎర్రబడిందని ఆ గుడ్డి వెలుగులోనే తెలుస్తోంది.

'ఆ మాటనిజమే,'అని ఆయన వొప్పుకున్నారు.

అతను ఈ మాట వినవట్లే చెప్పుకుపోయాడు :

'సమాజంలో ఆకలి, చిన్నచేపని తినేసే పెద్ద చేపలూ వున్నంతకాలం, కన్నీటిబొట్లూ తప్పవు, తల్లుల కడుపులో చిచ్చూ తప్పదు.'

ఇతనితో వాదన వేసుకోవటంవల్ల ఆయనకి తనపని నెరవేరదేమోనని భయం కలిగింది. అయినా కొంచెం తటపటాయించి, 'అయితే...కమ్యూనిజంలో చిన్న చేపని పెద్దచేప తినదంటారేమిటి?' అన్నారాయన బెరుగ్గా.

'ఎందుకు తినదూ? హంగరీ, జకోస్లోవేకియా, టిబెట్లూ, ఇవన్నీ నేనూ పేపర్లలో చదువుతూనే వున్నాను. పెద్ద నాయకుణ్ణి వ్యతరేకించిన చిన్న నాయకులు ఐపూ మచ్చాలేకుండా పోవటమూ ఎరుగుదును. సైబీరియాకీ పిచ్చాసుపత్రికీ పంపించబడ్డ మేధావుల సంగతీ యెరుగుదును. అక్కడ పెద్దచేప మింగిందంటే, చిన్నచేపల ముళ్ళూ పొలుసులూకూడా మిగలవు. తల్లిచేప పైకి ఏడవటానిక్కూడా జడుస్తుంది.'

'ఆ! అయితే మీరు కమ్యూనిస్టు కాదన్నమాట!' అన్నారు సుబ్బరామయ్యగారు నోరు వెళ్లబెట్టి.

'ఇప్పుడు కాదు. అందుకే నేను మీలోనూ కలవను, వీళ్లలోనూ కలవను. సగంచచ్చి ఈ మారుమూల బతుకుతున్నాను. కొన్ని నిజాలు మాజీ కమ్యూనిస్టులకి తెలిసినంత స్పష్టంగా మరొకరికి తెలియవు సుబ్బరామయ్యగారూ. కమ్యూనిజంలో ఏ దారుణం జరిగినా, ఏమిటిదని వాళ్లనడిగితే, 'ఓ, ఇవన్నీ తాత్కాలికమైన చిక్కులు' అంటారు. అదే ఇక్కడ జరిగితే, 'అది వ్యవస్థలోవున్న వైరుధ్యం, ఈ సమాజాన్ని పాతేస్తాం' అంటారు. మూఢత్వమూ, దురాశా, సోమరితనం, భయం, ఇవి నశించనంతకాలమూ వ్యవస్థ ఏదైనప్పటికీ కన్నీళ్లూ కడుపుచిచ్చులూ తప్పవు. ఇంతోడిదానికి, మా సిద్ధాంతమే ప్రపంచకానికి తరణోపాయమని అరుస్తారు కొందరు. మా దేశంలో అంతులేని జనాభావుంది, అందులో సగంమంది మూడో ప్రపంచయుద్ధంలో చచ్చినా, వాళ్ల యెముకలమీద మిగతా సగంమందితోనూ నవసమాజం సృష్టిస్తామని కొందరు అరుస్తారు. వాళ్లమాట చెల్లితే, అసలు జరిగేది సగంమందికి చావు, సగంమందికి సంకెళ్లూను. పాత మూఢనమ్మకాలస్థానే కొత్త మూఢనమ్మకాలు సృష్టిస్తారు రక్తపిపాసులు. ఎటొచ్చీ అధికారదాహంలో వాళ్లకి మీరు మీకు వాళ్లూ తీసిపోరు. మధ్యలో చచ్చేది మీ అబ్బాయి లాంటి వాళ్లు. రాబోయే నవసమాజానికి పునాదులుగా వాళ్ళ ఎముకలు పనికొస్తాయి...'

అతను ఇంకా చెప్పబోతున్నాడు. కాని సుబ్బరామయ్యగారు ఒక్కసారి అతనిపక్కకి దూకారు: 'అంతమాటనకండి. మా అబ్బాయి అమాయకుడు. వాడికేమీ తెలియదు. వాడు అమాయకుడు. తెలియక దారి తప్పాడు. వాడు అమాయకుడు...' అని అన్నమాటే అనటం ప్రారంభించారు—తన కొడిక్కి ఆ పెద్దమనిషి మరణశిక్ష విధిస్తున్నట్లుగా!

అతను కొంచెం శాంతించి 'లేదు లెండి. మీ అబ్బాయంటే మీ అబ్బాయేకాదు. ఆ వయసులో వాళ్లకి ఆవేశం ఎక్కువ, ఆలోచన తక్కువ. ఈ సమాజంలో జరుగుతున్న అన్యాయాలూ అక్రమాలూ ముఖ్యంగా ఒక వంక ఆకలీ మరొక వంక అతి మింగుడూ వాళ్లకి కడుమంట కలిగిస్తున్నాయి. దీన్ని పీకేస్తామని బయల్దేరారు. మరో సమాజం చూడనివాళ్లకి దగ్గర కొండలు గరుకు. ఆ గరుకులు కొన్ని చదునుచేస్తే చాలదూ!'

ఆయన ఆందోళన కొంచెం అణుచుకుని, 'ఇంతకీ మీ పేరేమిటి మేస్టారూ?' అన్నారు.

'నా పేరేదయితే యేంగాని,మీకు సాయం చెయ్యటానికి ప్రయత్నించటంవల్ల నాకు రెండువిధాల నష్టం. ఇటు పోలీసులకి నాకు నక్సలైట్లతో సంబంధం వుందని అనుమానం కలుగుతుంది. అటు నక్సలైట్లకి నేను పోలీసు ఏజంటునేమోనని అనుమానం కలుగుతుంది. మీరు వెంటనే ఇక్కణ్ణించి వెళ్లిపోతే మంచిది' అన్నాడతను.

'మీకు ప్రమాదం కల్పించటం నామతం కాదు. నేను వెంటనే ఇంకెక్కడికైనా వెళ్లి రాత్రి గడుపుతాను. మీకు పోలీసుల్నుంచేమీ ప్రమాదం లేకుండా నేను పూచీ పడతాను. నాకు సాయం చెయ్యటానికి

మీరే సరైన మనిషిలా కనిపిస్తున్నారు. డబ్బెంతైనా ఖర్చు పెట్టడానికి సిద్ధం.'

'డబ్బుతో కొనరాని వస్తువులు ఇంకా కొన్ని ఉన్నాయని మీా కెప్పటికీ నమ్మకం కల్గదు, సుబ్బ రామయ్యగారూ.' అన్నాడు పంతులుగారు కటువుగా. అయితే రంగారావు సంగతి వాకబుచేసి చెబుతానని మాత్రం వొప్పుకున్నాడు. అక్కడికిదగ్గర్లో అప్పలసామి కొట్లో రాత్రి వుండటానికి చోటు దొరుకుతుందని పంపించాడు. 'రేపు సాయంత్రం నాలుగ్గంటలకి బడి వొదుల్తాము. ఆ టైముకి నేనేవొచ్చి మిమ్మల్ని కలుసుకుని ఏ మాటా చెప్తాను,' అన్నాడు.

* * *

తెల్లవారగానే అప్పలసామి టీ తెచ్చి ఇచ్చాడు. ఆయన ఏం పనిమీద అక్కడికి వచ్చారో కూపీ తియ్యటానికి ప్రయత్నించాడు. చింతపండు వర్తకం పెడదామని సరుకు విషయం ఆరా తియ్యటానికి వచ్చానన్నారాయన. అప్పలసామి నవ్వి 'చింతపండు కిది సీతనుకాదు బాబూ, మీకీ యవ్వారం సంగతి బొత్తిగా తెలీదునాగుంది' అన్నాడు మర్యాదగా. ఆయన చిరునవ్వు నవ్వి ఊరుకున్నారు.

ఇంతలో రెండు పోలీసు జీపులు అప్పలసామి కొట్టుముందు ఆగాయి అందులో ఒక జవాను చేతు లకీ కాళ్లకీ గాయాల కట్లతో మూలుగుతూ పడి వున్నాడు. అప్పలసామి వాళ్లకి నీళ్ళూ, టీ, సరఫరా చేశాడు.

'రేత్తిరికి కురుపాం దెగ్గిర పైరింగైపోనాదంట బాబూ. పోలీసోడిమీద బాంబేసేసినారు. ఇద్దరు సచ్చారు.'

'ఎవరిద్దరు చచ్చారు?' అన్నారు సుబ్బ రామయ్యగారు ఉలిక్కిపడి.

'ఆలే, నక్సలైట్లు' అన్నాడు అప్పలసామి. ఇంతలో మరొక పోలీసు జీపుకూడావచ్చి అక్కడ ఆగింది సుబ్బరామయ్యగారు లేచి నిలబడి జీపులోకి తొంగి చూశారు. గుడ్డకప్పిన రెండు శవాలు అందులో వున్నాయి.

వెంటనే ఆయన ముందు జీపులోవున్న పోలీసు అధికారి దగ్గరకి వెళ్లి 'ఆఫీసరుగారూ, చచ్చిపోయిన వాళ్లపేర్లు తెలిశాయా?' అన్నారు.

'వెళ్లవయ్యా, నీకెందుకు?' అన్నాడు అధికారి చిరాగ్గా. అతను చాలా ఆందోళనలో ఉన్నాడని తెలుస్తూనేవుంది. కాని మరొకసారి సుబ్బరామయ్య గార్ని తేరిపారజూసి, జీపులోనుంచి కిందికురికి, 'నమ స్కారం సార్, మీరెందు కొచ్చారిక్కడికి?' అన్నాడు.

అయన తనను బయట పెట్టవద్దని సంజ్ఞ చేసి, 'ఎవరు చచ్చిపోయారు?' అన్నారు టూకీగా.

'ఇంకాపేర్లు తెలియలేదండీ. ఎవళ్లో కొత్త కుర్రాళ్లు' అని తిన్నగా శవాలున్న జీపుదగ్గరికి దారి తీశాడు పోలీసు అధికారి.

సుబ్బరామయ్యగారి గుండెలు అప్పటికే వేగంగా కొట్టుకుంటున్నాయి. కొత్త కుర్రాళ్లనగానే గుండె వేగం మరికొంచెం హెచ్చింది. కాళ్లు పట్లు తప్పేంతగా వణకటం ప్రారంభించాయి. ఒక శవంమీద కప్పినగుడ్డ ఆయనే స్థిగత్వం కోల్పోయినచేత్తో లాగి చూశారు. అది తన కొడుకు శవంకాదని తెలియగానే గట్టిగా నిట్టూర్చారు.

పోలీసాఫీసరు రెండోశవం ముఖంమీద కప్పు తొలగించేసరికి ఆయన నాలుక పిడచకట్టుకు పోయింది. చావులోకూడా కోపం చిందిస్తూన్న ఆలేత ముఖం—రంగారావుది.

'రంగా!' అని ఒక్క అరుపు అరిచారాయన.—తన పిలుపువల్ల కొడుకు లేచి కూర్చుంటాడన్నంత ఆత్రంతో.

'ఎవరండి? శవాన్ని మీరు ఐడెంటిఫై చెయ్యగలరా?' అన్నాడు పోలీసు ఉద్యోగి.

పోలీసువారి శవాల గుర్తింపు సమస్యలు తీర్చే పరిస్థితిలో లేరు సుబ్బరామయ్యగారు. రెండునిమిషాల తరవాత, 'వృద్ధాప్యంలో ఈ చేతకాని నాన్నకి పనికి రాని పాఠం నేర్పావురా, రంగా!' అని సన్నటి మూలుగ లాంటి ధ్వని వినబడింది ఆయననోట. 'నువ్వే పాఠం నేర్చుకున్నావోకాని రంగా, ఆపాఠం నీకూ పనికిరాలేదు.' అని శవంమీద పడి గొల్లు మన్నారు సుబ్బరామయ్యగారు.